నిధులున్నా.. పనుల జాడేది.?

- మూడేళ్లుగా ఖజానాలోనే మూలుగుతున్న నిధులు
- చందుర్తి మండలంలో రూ.2.36 కోట్ల పనులకు గ్రహణం
- సర్పంచుల పెత్తనంతో ఆగిన పనులు

చందుర్తి: అభివృద్ధి పనుల కోసం వివిధ పథకాల ద్వారా నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్న పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యమే ఇందుకు కారణమనే విమర్శలున్నాయి. ఆయా గ్రామాల సర్పంచులు మోకాలడ్డుతుండడంతో పనులు ముందుకు సాగడం లేదన్న ఆరోపణలు గ్రామాల్లో వినిపిస్తున్నాయి. అత్యధికంగా అధికార పార్టీ సర్పంచులు పనులు చేయలేకపోవడంతో ఇంజినీరింగ్ అధికారులు నోరు మెదపడం లేదు. ఏళ్ల తరబడి పనులు చేయించలేక, మంజూరైనా నిధులను రద్దు చేయలేక కాలాన్ని నెట్టుకొస్తున్నారు.

మండలంలో కమ్యూనిటీ భవనాలకు మంజూరైనా నిధులే అధికంగా ఉన్నాయి. ఈ పనుల జాప్యం ఎన్నికల సమయంలో ప్రభావాన్ని చూపనున్నాయి. మండలంలో సుమారు రూ.2.36 కోట్ల పనులు ప్రారంభం కాక ఖజానాలో నిధులు మూలుగుతున్నాయి.



నర్సింగపూర్‌లో అసంపూర్తిగా కమ్యూనిటీ భవనం

సీడీపీ కింద రూ.31.50 లక్షలు

➡ కట్టలింగంపేట 1వ వార్డులో వృద్ధుల గృహ నిర్మాణానికి రూ.4 లక్షలు
➡ నర్సింగపూర్‌లోని 10వ వార్డులో గౌడ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.2 లక్షలు
➡ జోగాపూర్ 5వ వార్డులో బీరప్ప గుడి వద్ద కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.2 లక్షలు
➡ మూడపల్లి, నర్సింగపూర్‌లో మూడు, మర్రిగడ్డ రెండు, చందుర్తిలో ఒక కమ్యూనిటీ భవన మిగులు పనులకు రూ.16.50 లక్షలు
➡ చందుర్తి 1వ వార్డులో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు
➡ కమ్మరి నారాయణ ఇంటి నుంచి బీఎస్ఎన్ఎల్ టవర్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.3 లక్షలు
➡ చందుర్తి జెడ్పీహెచ్ఎస్‌లో గ్రంథాలయ బుక్స్ సరఫరాకు రూ.2 లక్షలు

ఎస్‌డీఎఫ్ కింద రూ.48.50 లక్షలు

➡ చందుర్తిలో శ్మశానవాటిక రూ.14 లక్షలు, పద్మనాయక భవన నిర్మాణానికి రూ.4 లక్షలు
➡ ఎన్గల్‌లో ఆరె కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.2 లక్షలు, ఆశిరెడ్డిపల్లె, తిమ్మాపూర్‌లలో ఎస్సీ మాదిగ కమ్యూనిటీ భవన నిర్మాణాలకు రూ.3 లక్షల చొప్పున, తిమ్మాపూర్ ఎస్సీ మాల కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.లక్ష 50 వేలు, రామన్నపేటలో ముదిరాజ్, ఎస్సీ మాదిగ, కమ్యూనిటీ భవన నిర్మాణాలకు రూ.3 లక్షలు చొప్పున
➡ తిమ్మాపూర్ ఒడ్డెర కాలనీ వద్ద బతుకమ్మ తెప్ప నిర్మాణానికి రూ.4 లక్షలు
➡ అనంతపల్లిలో కంబాల లింగయ్య ఇంటి నుంచి తోట్ల అంజయ్య ఇంటి వరకు రూ.6 లక్షలు, బక్కశెట్టి హనుమయ్య ఇంటి నుంచి అయితం శంకరయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.6 లక్షలు
➡ రామన్నపేట పెరుక కమ్యూనిటీ భవనం నుంచి దుద్యాల లక్ష్మారెడ్డి ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు
➡ మూడపల్లి రెడ్డి సంఘం నుంచి బద్దం వెంకట్‌రెడ్డి ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.2 లక్షలు

ఇతర పథకాల ద్వారా

➡ మండలంలోని సనుగులలో రెండు సీసీ రోడ్లు రూ.8 లక్షలు, బండపల్లిలో సీసీ రోడ్డుకు రూ.6.50 లక్షలు
➡ ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా ఆశిరెడ్డిపల్లె, బండపల్లి, చందుర్తి గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు ఒక్కొక్క గ్రామపంచాయతీకి రూ.16 లక్షల చొప్పున రూ.48 లక్షలు, లింగంపేట, చందుర్తి గ్రామపంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున, ఎన్గల్, బండపల్లి గ్రామ పంచాయతీలకు రూ.5 లక్షలు.
➡ ఎఫ్‌డీఆర్ పథకం కింద లింగంపేట–సనుగుల రహదారిపై కల్వర్టు నిర్మాణానికి రూ.38 లక్షలు, కిష్టంపేట నుంచి బండపల్లి గ్రామాల మధ్య రోడ్డుకు రూ.25 లక్షలు

మార్చిలోపు పూర్తి చేస్తాం



మా గ్రామంలో మూడు కమ్యూనిటీ భవనాలతో పాటు సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే నిర్మాణానికి కావాల్సిన సామగ్రి పని చేసే ప్రదేశాల్లో సిద్ధం చేసుకున్నాం. గ్రామంలో రూ.12 లక్షల పనులను మార్చిలోపు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. రూ.5 లక్షల ఎస్సీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి.

– దుమ్ము అంజయ్య, సర్పంచ్, రామన్నపేట

ప్రారంభించకుంటే రద్దు చేస్తాం



గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ఈ పనులను వెంటనే ప్రారంభించాలని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీల దృష్టికి తీసుకువెళ్లాం. లేకుంటే 15 రోజుల్లో ప్రారంభం చేయకపోతే మంజూరైన పనులను రద్దు చేస్తామన్నాం. పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ శాఖ ఏఈ, చందుర్తి

క్లుప్తంగా

‘దళితుల భూములు వారికే చెందాలి’



మాట్లాడుతున్న కడారి రాములు

వేములవాడరూరల్: గత ప్రభుత్వం దళితుల కోసం భూమి ఇస్తే ఈ ప్రభుత్వం వాటిని లాక్కోవడం ఎంతవరకు సమంజసమని సీపీఐ నాయకులు కడారి రాములు అన్నారు. మండలంలోని మర్రిపల్లి గ్రామంలో చాలా ఏళ్ల క్రితం నిరుపేద దళితులకు ఇచ్చిన భూమిని అభివృద్ధి పేరుతో తీసుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఈ ఆలోచనను విరమించుకుని న్యాయబద్ధంగా దళితులకు చెందాల్సిన స్థలాలను వారికి ఇవ్వాలని, లేకుంటే వారికి మద్దతుగా ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మర్రిపల్లి గ్రామానికి చెందిన దళితులు, మహిళలు, భూయజమానులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రధాని కావాలని పాదయాత్ర



తంగళ్లపల్లిలో స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి: సీఎం కేసీఆర్ భారత ప్రధాని కావాలని ఆకాంక్షతో మెదక్ జిల్లా భూపతిపూర్ సర్పంచ్ లక్ష్మీనారాయణ కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన పాదయాత్ర బుధవారం తంగళ్లపల్లి మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిరిసిల్ల సింగిల్‌విండో వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు ఎగుమామిడి వెంకటరమణారెడ్డి పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు. వారితో కాసేపు ముచ్చటించి పాదయాత్ర బృందానికి పండ్లు అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు రెడ్డి పర్శరాములు, బండి అనిల్ గౌడ్, మహేందర్, బాలు, ప్రవీణ్ పాల్గొన్నారు.

అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలి



ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

చందుర్తి: అత్యవసర మందులను ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలని ఎంపీపీ బైరగోని లావణ్య అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆసుపత్రి సాధారణ నిధుల నుంచి పాముకాటు ఇంజెక్షన్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేసినా సరిపడని మందులను కొనుగోలు చేయాలన్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు సహకారంతో ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.కోటి 56 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో భూమిపూజ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వైద్యాధికారి సంపత్, అభివృద్ధి కమిటీ సభ్యులు మందాల అబ్రహం, దుమ్ము అంజయ్య పాల్గొన్నారు.

రాజన్న ఆలయం ఎదుట ఫైర్‌సేఫ్టీ ట్రయల్స్



ఫైర్ ట్రయల్స్ పరిశీలిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ: మహాశివరాత్రి జాతర మహోత్సవాల సందర్భంగా సేఫ్టీ కోసం ఫైర్ పరికరాలను డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో పోలీసులు, ఫైర్ సిబ్బంది బుధవారం ఆలయం ఎదుట ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్, ఎస్సై రఫీక్, ఏఈవో బీ. శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజన్న సేవలో..

రాజన్న భక్తులకు ఉచితంగా సేవలందించేందుకు కోరుట్లకు చెందిన వనజా గ్రూప్ సేవా సమితి మహిళలు ముందుకు వచ్చారు.

ఆదిలాబాద్ విద్యార్థులకు ప్రత్యేక దర్శనం

రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన ఆదిలాబాద్ జిల్లా జైనత్ మండలం గోడ గ్రామానికి చెందిన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు 65 మందితో పాటు హెచ్ఎం గజేందర్‌కు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు.

రాజన్నకు నక్షత్ర ప్రైవేట్ సెక్యూరిటీ

రాజన్న భక్తులకు హైదరాబాద్‌కు చెందిన నక్షత్ర ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది బుధవారం సేవలందించారు. ఇప్పటికే ఆలయంలో ఎస్పీఎఫ్, హోంగార్డులు సేవలందిస్తున్నారు. వీరితోపాటు ప్రైవేట్ సెక్యూరిటీని సైతం ఉపయోగించుకుంటున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శ్రీపెద్దమ్మ దేవాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

ముస్తాబాద్: మండలంలోని చిప్పలపల్లిలో పురాతన శ్రీపెద్దమ్మ ఆలయ నిర్మాణానికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం భూమిపూజ చేశారు. చీకోడు, ముచ్చర్ల గ్రామాల శివారులో ఉన్న వీటిని వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఆలయాల నిర్మాణాలను చేపట్టామన్నారు. వందల ఏళ్ల నాటి ఆలయాలను జీర్ణోద్ధరణ చేసేందుకు ముదిరాజ్ సంఘం ముందుకు వచ్చిందన్నారు. సంఘం నాయకులు గాడిచెర్ల రామచంద్రం, వీరవేని కిష్టయ్య, జెల్ల రవి, రాజయ్య, దేవరాజు, వెంకటనర్స్, పడిగె అంజనేయులు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్న వయసులో పెద్ద మనసు



లవన్ తల్లికి నగదు అందిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సిరిసిల్లకల్చరల్: సాటి విద్యార్థి మరణం వారిని ఆ చిన్నారులను కలచివేసింది. కాని కడు పేదరికంలో ఉన్న స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవాలని వీరి సంకల్పానికి ఉపాధ్యాయులు సైతం తోడయ్యారు. సిరిసిల్ల గీతానగర్ జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న లవన్ అనే విద్యార్థి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. తల్లి, చెల్లి ఉన్న అతని కుటుంబానికి ఎంతో కొంత చేయూతనందించాలని భావించిన విద్యార్థులంతా కలిసి రూ.15 వేలు సేకరించారు. ఉపాధ్యాయ బృందం సైతం తమ వంతుగా మరో రూ.12 వేలు కలుపగా మొత్తం రూ.27 వేలను బుధవారం లవన్ కుటుంబానికి అందజేశారు.

పుస్తె మెట్టెలు అందజేత

ఎల్లారెడ్డిపేట: నిరుపేద కుటుంబాలకు చెందిన మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన అంబటి జ్యోత్స్న, శివరాత్రి రచన, అక్కపల్లి గ్రామానికి చెందిన నేదునూరి శృతి పెళ్లిళ్లకు స్థానిక సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి బుధవారం పుస్తెమెట్టెలను అందజేశారు.

యువతి ఆత్మహత్యాయత్నం

వేములవాడఅర్బన్: మతిస్థిమితం కోల్పోయిన వేములవాడ పట్టణంలోని బాలనగర్‌కు చెందిన యువతి బుధవారం నాంపల్లి శివారులోని వేములవాడ–కరీంనగర్ రహదారిని అనుకుని ఉన్న పోచమ్మ గుడిబండ చెరువులోకి దూకింది. వెంటనే గమనించిన స్థానికులు ఆమెను బయటికి తీసి వారి బంధువులకు సమాచారం అందించడంతో వారు ఆమెను తీసుకెళ్లారు.

ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి



ముస్తాబాద్: నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

ముస్తాబాద్: సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ముస్తాబాద్‌లో బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కొత్త బస్టాండ్ నుంచి మండల పరిషత్ వరకు గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు సేవాలాల్ మహరాజ్‌ను కీర్తిస్తూ పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఎంపీడీవో రమాదేవి, వైద్యాధికారి డాక్టర్ చందునాయక్, బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు లకావత్ నర్సింలు నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య గురుబాబునాయక్, సర్పంచులు పాల్గొన్నారు.



వీర్నపల్లి: బోగ్‌బండార్ నిర్వహిస్తున్న గిరిజనులు

వీర్నపల్లి: మండలం బాబాయిచెరువు, బావుసింగ్ నాయక్‌తండా, రంగంపేట, సీతారాంనాయక్‌తండా, కేలోతుతండాలో బుధవారం సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహించారు. గిరిజనులు జగదాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోగ్ బండార్, సేవాలాల్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీవో నరేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండలంలోని బడితండా, దెగావత్‌తండా గ్రామాలలో సేవాలాల్ మహరాజ్‌ను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దెగావత్ తిరుపతి, నాయకులు రాందాస్, గిరిజన తండా గ్రామాల సర్పంచులు, పెద్ద ఎత్తున గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

బియ్యపు గింజలతో శివలింగం



ముస్తాబాద్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని గూడెం గ్రామానికి చెందిన బొప్ప సౌజన్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలు బియ్యపు గింజలతో శివలింగాన్ని చెక్కి భక్తిని చాటుకున్నారు. ఎంతో ఓర్పు నైపుణ్యంతో బియ్యం గింజలపై చెక్కిన శివలింగం ఆకట్టుకుంటోంది. గతంలోనే చాక్‌పీసులపై అద్భుతమైన శిల్పాలను సౌజన్య చెక్కారు.

చిత్రకథ



రోడ్డుపై గుంత

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజుపల్లి వద్ద రోడ్డుకు ఇరువైపులా గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ప్రతిరోజు ఆలయానికి వచ్చే వాహనాలన్నీ ఈ ప్రాంతం నుంచే వస్తాయి. శివరాత్రి సందర్భంగా అభివృద్ధి పనుల పేరుతో కోట్లు ఖర్చు పెడుతున్న ఆలయ అధికారులు కనీసం వీటిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న టెస్కాబ్ చైర్మన్

గంభీరావుపేట: మండలంలో 44 మంది లబ్ధిదారులకు బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులను టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సర్పంచ్ శ్రీధర్‌పంతులు, తహసీల్దార్ మధుసుదన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, పట్టణ శాఖ అధ్యక్షుడు వెంకటి యాదవ్, ఉపసర్పంచ్ నాగరాజుగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అహ్మద్ పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

మండలం గోరింటాల పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. మండలంలోని జగదాంబతండాలో శ్రీఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో సర్పంచులు అంజమ్మ, బాల్యానాయక్, జెడ్పీటీసీ విజయ, ఎంపీపీ కరుణ, ఎంపీటీసీలు అంజిరెడ్డి, కవిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆస్పత్రి సందర్శన

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే రమేశ్‌బాబు దంపతులు బుధవారం సందర్శించారు. వీరితో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, ఆసుపత్రి వైద్యులు తదితరులు ఉన్నారు.

హోటల్‌లో ఎమ్మెల్యే దంపతులు



హోటల్‌లో టిఫిన్ చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

వేములవాడ: ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఆయన సతీమణి మరియాతో కలసి బుధవారం కాసేపు సరదాగా గడిపారు. నిత్యం రద్దీగా ఉండే రాఘవేంద్ర ఉడిపి హోటల్‌కు చేరుకుని పాత మిత్రులు, ప్రముఖ వ్యాపారులు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, సెస్ డైరెక్టర్ నామాల ఉమ, కౌన్సిలర్లు నరాల శేఖర్, మారం కుమార్, బీఆర్ఎస్ నాయకులతో కలసి టిఫిన్లు చేశారు. అనంతరం వ్యాపారులు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు.

నూతన బస్సులు ప్రారంభం

వేములవాడ ఆర్టీసీ డిపో నుంచి తిరుపతికి వెళ్లే నూతన సూపర్ లగ్జరీ బస్సు, హైదరాబాద్ జేబీఎస్‌కు నూతన డీలక్స్ బస్సును వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు బుధవారం ప్రారంభించారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



రాళ్లపేటలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

తంగళ్లపల్లి: మండలంలోని రాళ్లపేట గ్రామంలో నేరెళ్ల పీహెచ్‌సీ మెడికల్ అధికారి జిందం రేఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పర్శరాములు, క్యాంపు మెడికల్ ఆఫీసర్ ప్రియదర్శిని, ఆప్టోమెట్రిస్ట్ రాకేశ్, సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి నిరుపేద విద్యార్థులకు చదువునందించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మ్యాకల మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇల్లంతకుంట మారుమూల ప్రాంతం కావడంతో విద్యార్థులు డిగ్రీ చదవాలంటే సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్ల వంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తుందని, ప్రభుత్వం స్పందించి మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు.

హరిత నర్సరీ పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని జవారిపేట గ్రామంలో హరిత నర్సరీని ఏపీవో చంద్రయ్య బుధవారం పరిశీలించారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున ఇప్పుడే మొలకెత్తుతున్న మొక్కలు ఎండకు ఎండకుండా ఉండేందుకు షేడ్ నెట్లు ఏర్పాటు చేయడంతో పాటు రోజు ఉదయం, సాయంత్రం నీళ్లు పట్టాలని నిర్వాహకులకు సూచించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

వేములవాడ: ఈనెల 12న కరీంనగర్‌లో రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో వేములవాడ పట్టణంలోని కేరళ మోడల్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను కనబరచి పతకాలు సాధించారు. దీంతో అధ్యాపకులు మనోజ్‌కుమార్, మనోజ్‌కుమారి, నిథిన్, విశాల్, కరాటే మాస్టర్ ఎంఏ మన్నాన్, బుధవారం విద్యార్థులను అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు ఎంపీపీ పడిగెల మానస సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

ఆర్థిక సాయం

ముస్తాబాద్: మండలంలోని రాంరెడ్డిపల్లెలో విద్యుదాఘాతంతో నష్టపోయిన యాపకాయల రాజు కుటుంబానికి సెస్ మాజీ డైరెక్టర్ విజయరామారావు బుధవారం ఆర్థికసాయం అందించారు.

జర్నలిస్ట్ కాలనీ సందర్శించిన సెస్ చైర్మన్

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీ గ్రామ పంచాయతీ పరిధిలో జర్నలిస్టులకు ఇచ్చిన నివేశనా స్థలాలను బుధవారం సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పరిశీలించారు. హైటెన్షన్ విద్యుత్ తీగలను తొలగించాలని కోరడంతో, పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జయంత్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

‘ఆధార్’లో మార్పులు, చేర్పులు

గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేటలో బుధవారం ఆధార్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో అవసరమైన మార్పులు, చేర్పులు చేయించుకోవాలని సెంటర్ నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ చైతన్య, ఉపసర్పంచ్ దుబాసి రాజు, వార్డుసభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

సమస్యలపై పాదయాత్రలతో నిరసన

ఎల్లారెడ్డిపేట: మండలంలో ప్రధాన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడుతామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దొమ్మటి నర్సయ్య అన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 30 పడకల ఆసుపత్రి మలకపేట రిజర్వాయర్ నుంచి తొమ్మిదో ప్యాకేజీ ద్వారా సింగసముద్రం నింపి రైతులకు సాగునీరు అందించడం లాంటి ప్రధాన సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

పాఠశాలలో కోతుల బెడద

వేములవాడరూరల్: మండలంలోని వట్టింల ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌కు ప్రతిరోజు కోతుల మంద వచ్చి పరిసరాల్లో కూరగాయలు, పూల చెట్లను చిందరవందర చేస్తున్నాయని అంగన్‌వాడీ సెంటర్ నిర్వాహకురాలు జ్యోతి తెలిపారు. భోజన సమయంలో వచ్చి నానా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, కోతుల బారినుంచి కాపాడాలని కోరారు.

ప్రజా సమస్యలపై పోరాడుతాం

సిరిసిల్లటౌన్: బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీజేపీ నిరంతర పోరాటం చేస్తుందని పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం సిరిసిల్లలోని నెహ్రూనగర్, పద్మనగర్, వెంకంపేట ప్రాంతాల్లో నిర్వహించిన స్ట్రీట్‌కార్నర్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. మున్సిపల్ మాజీచైర్మన్ ఆడెపు రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



దేవయ్య మృతదేహం

చందుర్తి: మోపెడ్ పైనుంచి కింద పడి ఓ నిండు ప్రాణం గాలిలో కలిసింది. బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటన మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో తీరని విషాదాన్ని నింపింది. గ్రామస్తుల కథనం ప్రకారం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చింతల దేవయ్య (55) తన మోపెడ్‌పై నర్సింగపూర్ గ్రామానికి బుధవారం సాయంత్రం వెళ్లి వస్తుండగా బస్టాండ్ దాటగానే మోపెడ్ అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లడంతో తలకు బలమైన దెబ్బ తగిలింది. వెంటనే స్థానికులు వేములవాడలోని ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడికి భార్య పద్మ, కుమారులు గణేశ్, రాజేశ్ ఉన్నారు.

శ్రీరేణుక ఎల్లమ్మ సన్నిధిలో డీసీసీ అధ్యక్షుడు



ప్రత్యేక పూజలో డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మతల్లిని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సిద్ధోగంలో భాగంగా అమ్మవారి కల్యాణం, పట్నాలు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎల్లమ్మతల్లి దీవెనలు ప్రజలందరిపై ఉండాలన్నారు. జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు రామస్వామి, సర్పంచ్ జలపతి, నాయకులు అమ్మవారి దర్శించుకున్నారు.